క్లుప్తంగా

రేపు మండల సమావేశం

నందలూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సభా భవనంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు మేడా విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం(రేపు) ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, మండల ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల ఉన్నతాధికారులు తప్పక హాజరు కావాలని వారు కోరారు.

కళాశాలకు ప్లేట్లు వితరణ



దాత సుధీర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

నందలూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థుల మధ్యాహ్న భోజనం పథకాన్ని శ్రీ సౌమ్యనాథ ఫిల్లింగ్ స్టేషన్ అధినేత ఉప్పుశెట్టి సుధీర్ 120 స్టీల్ ప్లేట్లను సోమవారం అందజేశారు. అనంతరం దాతను ప్రిన్సిపల్ శ్రీదేవి, అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

పుల్లంపేట : పుల్లంపేట గ్రామ పంచాయతీలో సోమవారం సంక్రాంతి పండుగ సమీపిస్తున్నందున గ్రామ సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన గ్రామంలో కొత్త ఎల్ఈడీ దీపాలు, చెడిపోయిన వీధి లైట్లకు మరమ్మతులు చేయించడం జరిగింది. దీంతో గ్రామంలో కొత్త ఎల్ఈడీ కాంతులు వెదజల్లాయి. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

టీడీపీ నాయకుడిపై డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

రాజంపేట : రాజంపేట 10టీవీ విలేకరి కూరాకు శ్రీనివాసులను పుల్లంపేట మండలం రామక్కపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు ఇటీవల ఫోన్‌లో బెదిరించారు. దీనిపై బాధితుడితో కలిసి రాజంపేట జర్నలిస్టులు రాజంపేట ఎస్‌డీపీఓ సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. జర్నలిస్టులను బెదిరించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎస్‌డీపీఓ సానుకూలంగా స్పందించారు. దీనిపై విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు.

ద్విచక్ర వాహనదారుడిని ఢీ కొన్న ఆటో

గాలివీడు : మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకు వద్ద ద్విచక్ర వాహనదారుడు సాయి ప్రతాప్‌రెడ్డిని ఆటో ఢీ కొన్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గోపనపల్లె గ్రామం చీపరమోళ్ల పల్లెకు చెందిన సాయి ప్రతాప్‌రెడ్డి బస్టాండ్ నుంచి గేటు వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో సాయిప్రతాప్ రెడ్డి కుడికాలు విరిగింది. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.


జాతీయ రహదారికి మరమ్మతు పనులు



హైవేపై జరుగుతున్న మరమ్మతు పనులు

రైల్వేకోడూరు అర్బన్ : కడప చెన్నై జాతీయ రహదారికి కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు సోమవారం మరమ్మతులు ప్రారంభించింది. కుక్కలదొడ్డిలోని కేశవరెడ్డి పబ్లిక్ స్కూల్ వద్ద నుంచి రహదారిలో గుంతలు పూడ్చే పనులను చేపట్టారు. రోడ్లు దెబ్బతిన్నా.. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు, నాయకులు, ఇప్పుడు రోడ్ల రిపేర్లకు నిధులు కేటాయించి పనులు చేయిస్తుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతగా పనులు చేపట్టాలని కోరుతున్నారు.

వర్మీకంపోస్టుతో రైతులకు ఉపయోగాలు



వానపాములు వదులుతున్న సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి

పుల్లంపేట : ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద కేంద్రాలలో వర్మీ కంపోస్టు తయారు చేయాలని ఏఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని తిప్పాయిపల్లి గ్రామం, రెడ్డిపల్లి, గారాలమడుగు, పుల్లంపేట గ్రామ పంచాయతీలలోని వర్మీకంపోస్టులో వానపాములు వదిలి తద్వారా చెత్త నుంచి సంపదను తయారు చేయడం జరుగుతుందని ఏఓ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యభాగ్యం

- చిరుధాన్యాలపై ప్రజల ఆసక్తి
- సాగు చేసే రైతులకు లాభమేనంటున్న అధికారులు
- ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పాటునిస్తాయని చెబుతున్న వైద్యులు

పూర్వీకుల ఆహారపు అలవాట్లు అనుసరించేందుకు ప్రజలు మొగ్గుచూపుతున్నారు. అప్పటి చిరుధాన్యాలను ఇప్పుడు ఆరోగ్య సిరి ధాన్యాలుగా భావిస్తున్నారు. ఆ రోజులలో వీటి వాడకంతో ఎలాంటి రోగాలు దరిచేరకుండా అలసటలేని జీవితం గడిపేవారు. అప్పట్లో ఉన్న ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి రక్షణ ఇచ్చేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తకొత్త రోగాలు ప్రబలతున్నాయి. వైద్యులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు ఇప్పుడు ఫలితాలు ఇస్తున్నాయి. అప్పట్లో పురుగు మందులు, రసాయనిక ఎరువులు లేని ఆహారంతో ఆరోగ్యంగా ఉండేవారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న చిరుధాన్యాలు

రైల్వేకోడూరు అర్బన్ : యాంత్రిక జీవనంలో రోగం లేని మనిషి, మందులు లేని ఇల్లు అరుదు. ఎక్కువగా వివిధ రకాల జబ్బులతో మరణించే వారి సంఖ్య ఎక్కువ. పాత పద్ధతిలో ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా జీవించవచ్చునని ఆహార, ప్రకృతి శాస్త్రవేత్తలు, వైద్యులు సిరిధాన్యాలపై అవగాహన కలిపిస్తున్నారు. ప్రజలు కూడా సిరిధాన్యాల గొప్పదనాన్ని గుర్తిస్తున్నారు. అదే విధంగా పట్టణాలలో సిరిధాన్యాల దుకాణాలు వెలుస్తున్నాయి. అండుకొర్రలు, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు మొదలగు వాటితో అన్నంతోపాటు గంజి, ఇడ్లి, దోశ, ఉప్మా, చపాతి, మురుకులు వంటివి చేసుకోవచ్చు. వీటిలో 8 నుంచి 12.5 శాతం ఫైబర్ ఉంటుంది. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, ఊబకాయం, మూర్ఛ, గాంగ్రీ, క్యాన్సర్, గర్భాశయ వ్యాధులు, మూత్ర పిండాలు దెబ్బతినడం, పంటి సమస్యలు, థైరాయిడ్ వ్యాధులు నయమవుతున్నట్లు చెబుతున్నారు. ఈ పంటల సాగువల్ల రైతులకు ఆదాయం, వినియోగించే వారు ఆరోగ్యంగా ఉంటారని చెబుతున్నారు.

అప్పడప్పుడూ వాడుతున్నాం



మా తల్లిదండ్రుల కాలంలో చిరుధాన్యాలు వాడేవారు. వాటితోనే గంజి తాగేవాళ్లు కానీ నేడు అవి దొరకడం లేదు. పాత కాలం మనుషుల ఆరోగ్య రహస్యం అప్పటి ఆహారపు అలవాట్లే, వాటి వల్ల ఇప్పటి వారు ఆరోగ్యంగా ఉన్నారు. ప్రస్తుతం చిరుధాన్యాలకు ఆదరణ లభిస్తుండటం శుభపరిణామం. ప్రతి ఒక్కరూ వీటి వినియోగించి ఆరోగ్యంగా ఉండాలి.

– నాగోలు నరసారామిరెడ్డి, ఉపాధ్యాయులు, రైల్వేకోడూరు

సిరిధాన్యాల సాగును ప్రోత్సహిస్తాం



సిరి ధాన్యాలు సాగు చేయాలనే రైతులు వ్యవసాయ అధికారులకు తెలియజేస్తే ప్రభుత్వం నుంచి వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి ప్రోత్సహిస్తాం. సిరిధాన్యాలకు గిట్టుబాటు ధరలు పెంచారు. తక్కువ నీటితో సాగు చేయవచ్చు రైతులకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి.

– సుధాకర్, వ్యవసాయ అధికారి, రైల్వేకోడూరు మండలం

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



ఆహారం ఎంత ముఖ్యమో.. ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. కాబట్టి పాత కాలం నాటి ఆహారపు అలవాట్లయినా సిరి ధాన్యాల వైపు మొగ్గు చూపాలి. క్రిమి సంహారక మందులు వాడకుండా పండించే సిరిధాన్యాల వాడకం వల్ల మంచి పోషకాలు శరారానికి అందుతాయి. దీనివల్ల జబ్బులు దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ వెంగల్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు, రైల్వేకోడూరు మండలం

గోవింద నామస్మరణతో మార్మోగిన సుండుపల్లె



తిరుమలకు బయల్దేరుతున్న గోవింద మాలధారులు

సుండుపల్లె : మండల కేంద్రం సోమవారం గోవింద నామస్మరణలతో మార్మోగింది. మండలంలో గోవిందమాల ధరించిన భక్తులు తిరుమలకు 16వ సారి మహా పాదయాత్రను సుండుపల్లెలోని విరూపాక్ష ఆలయం నుంచి ప్రారంభించారు. వంద కిలో మీటర్ల మేర సాగే ఈ పాదయాత్రల్లో మాలధారులు వందలాదిగా పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వీధులు భక్తులతో కిక్కిరిసి కనిపించింది. పాదయాత్రలో స్వామి వారి చిత్రపటాన్ని చేతపట్టుకొని సాగడంతో ప్రత్యేక శోభ చేకూరింది. పాదయాత్ర సాగే దారి వెంబడి స్వామి వారి చిత్రపటానికి భక్తులు హారతులు పట్టి టెంకాయలు కొట్టి భక్తిని చాటారు. వైకుంఠ ఏకాదశికి తిరుమలకు చేరుకొని వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడమే లక్ష్యంగా బయలుదేరారు.

కార్మికుల సంఘాలతో ఎంతో ఉపయోగం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారి డి.కృష్ణ

రాయచోటి (జగదాంబసెంటర్) : చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నమయ్య జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు డి.కృష్ణ వెల్లడించారు. సోమవారం చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన 2025 సంవత్సరపు క్యాలెండర్‌ను ఆయన రాయచోటిలోని ఆ శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఇలాంటి సంఘాల వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. గత 34 సంవత్సరాలుగా చేనేత కార్మికుల సంక్షేమము మరియు ఉపాధి, చేనేత రంగ రక్షణకు చేనేత కార్మిక యూనియన్ నాయకులు పనిచేస్తున్నారని, వారి కృషి అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు వెంకట్‌కుమార్, ప్రవీణ్ కుమార్‌రాజు, చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామమోహన్, రాష్ట్ర కార్యదర్శి గురుస్వామి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు గుంపు వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, శ్రీరామకృష్ణ, శంకారపు రామచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, తంబళ్లపల్లి అధ్యక్షులు అనంత ఈశ్వరయ్య, చేనేత కార్మికులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులకు సోలో డ్యాన్స్, సోలో సింగింగ్, గ్రూప్ డ్యాన్స్, సంక్రాంతి పండుగ విశిష్టత, రంగోలి తదితర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించామన్నారు. పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు. సాంప్రదాయ దుస్తులతో విద్యార్థులు ఆకర్షణీయంగా కనిపించారు. కార్యక్రమం డా.అనిత, సుస్మిత, చక్రపాణి పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం లాభదాయకం



నందలూరు: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారి కృష్ణయ్య



చిన్నమండెం: మహిళా సంఘ సభ్యులకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందజేస్తున్న అధికారులు

నందలూరు : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో లాభదాయకమే కాకుండా ఆరోగ్యకరం అని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల యూనిట్ ఇన్‌చార్జ్ కృష్ణయ్యలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వల్ల కలిగే లాభాలను ప్రజలకు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడులు పెట్టి ఎక్కువ ఆదాయం పొందవచ్చన్నారు. రసాయన ఎరువులు వాడటం వల్ల వచ్చే ఉత్పత్తుల వల్ల అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. ఘన, ద్రవ, బీజామృతంలతో పాటు ప్రకృతి ఎరువుల ద్వారానే తాము పంటలు పండించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డివిజనల్ మోడల్ మేకర్ పుష్ప, ఐసీఆర్‌పీలు విజయ కుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

చిన్నమండెం : ప్రకృతి వ్యవసాయ రైతులు పండించిన ఉత్పత్తులను మహిళా సంఘాల సభ్యులకు రైతు సాధికార సంస్థ ద్వారా అందజేయడం జరుగుతుందని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రెడ్డమ్మ తెలిపారు. సోమవారం చిన్నమండెం మండల కేంద్రంలో మహిళా సంఘాలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డమ్మ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులందరూ కెమికల్ నిత్యావసర ఉత్పత్తులను తిని అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నట్లు చెప్పారు. ఇకనైనా ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును ఇవ్వాలని వివరించారు. కార్యక్రమంలో ఎంటీఎల్ చందురెడ్డి, మార్కెటింగ్ ఎంటీ పద్మావతి, శ్రీనివాసులు, వ్యాల్యూ చైన్ ఎస్ఎఫ్ఐ చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జ్ సాలమ్మ, ఐసీఆర్‌పీ శ్రీరాములు రెడ్డి, మండల టీం మెంబర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి అర్బన్ : స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ)కు చెందిన క్యాలెండర్లు, డైరీలను సోమవారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎస్టీయూ నేతలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించేలా చూడాలంటూ కోరారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్రనేతలు రవీంద్రనాథ రెడ్డి, మురళీకుమార్, మైనార్టీ జిల్లా కన్వీనర్ గోపీక్రిష్ణ, సునీర్, అంజద్ బాషా, గోపీక్రిష్ణ, వాసుదేవరెడ్డి, నాగరాజురెడ్డి, రమణయ్య, శంకర్‌రెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గోకులాలను త్వరగా పూర్తిచేయాలి



గోకులాలను పరిశీలిస్తున్న ఏపీఓ, ఈసీలు

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న గోకులాలను ఏపీఓ పెంచలయ్య, ఈసీ శివయ్యలు సిబ్బందితో కలిసి సోమవారం నల్లగుట్టపల్లి, సుద్దమళ్ల గ్రామాలను పరిశీలించారు. కుమ్మరపల్లె, బండపల్లి గ్రామాలను ఈసీ శివయ్య పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఉపాధి నిధుల ద్వారా మండలంలో 74 గోకులాలను మంజూరు కావడంతో అందులో 39 పూర్తికాక మిగిలిన వాటిలో 14 గునాది నిర్మాణంలో, 16 రూఫ్ స్థాయి ఉన్నట్లు తెలిపారు. ఒక్కో గోకులానికి రూ.2.30లక్షలు మంజూరు చేసినట్లు అధికారి తెలిపారు. త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలని నిర్వాహకులకు తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామ సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్రుడు తెలిపారు.

ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని బండికనుమ వద్ద ఇన్‌చార్జి ఎస్ఐ శివ ప్రసాద్ పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా చలమారెడ్డిపల్లె గ్రామానికి చెందిన చల్లా సుధాకర్ అనే వ్యక్తి టక్కోలు గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి ఇసుకను కడపకు అక్రమంగా తరలిస్తుండగా వాహనాల తనిఖీలో పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ట్రాక్టర్‌ను మండల తహసీల్దారు మాధవీలతకు అప్పజెప్పామని ఏఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైటర్ కొండయ్య, పోలీసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి కృషి చేద్దాం



కనకరాజును సన్మానిస్తున్న కొరముట్ల, నాయకులు

చిట్వేలి : ఇటీవల ప్రకటించిన వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న చిట్వేలి మండలం రాజుకుంటకు చెందిన మాదినేని కనకరాజును రైల్వేకోడూరు పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శీనివాసులు ఘనంగా సన్మానించారు. కనకరాజు జిల్లా కమిటీలో యాక్టివిటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కనకరాజును రైల్వేకోడూరుకు పిలిపించి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. కొరముట్ల మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న వారిని జిల్లా కమిటీలో స్థానం లభించిందన్నారు. పార్టీ పూర్వవైభవానికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం కనకరాజు, నాయకులు కొరముట్లను సన్మానించారు. కార్యక్రమంలో ధ్వజారెడ్డి, రమేష్, మహేష్, బాల, తేజ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ముస్తాబవుతున్న కంభరాయిని గుట్ట



ముస్తాబవుతున్న కంభరాయుడి గుట్ట



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు

రామాపురం : కడప – రాయచోటి ప్రధాన రహదారిలో టోల్‌గేట్ సమీపంలోని కంభరాయుని కొండపై వెలసిన మహావిష్ణు దేవాలయంలో వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి)కి పెద్దఎత్తున ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, మహా సుదర్శన యాగం, చండీయాగం, గరుడోత్సవం, చక్రస్నానం, కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తుల కొంగు బంగారమైన మహావిష్ణు దేవాలయంలో ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరుపుతారు. ఇందులో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేయనున్నారు. శుక్రవారం (10వ తేదీ) తెల్లవారుజామున మూలమూర్తులకు ఉత్సవమూర్తులకు సుప్రభాత సేవ, విశేషాలంకరణ ఆరు గంటల నుంచి ఉత్తర ద్వారం గుండా భక్తులను ప్రవేశింపజేసి స్వామి దర్శనం చేయించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అలానే సామూహిక సత్యనారాయణ వ్రత పూజను వైభవంగా జరుపనున్నట్లు తెలియజేశారు. అనంతరం శ్రీవారికి గరుడసేవ మహోత్సవం నిర్వహిస్తామని తెలియజేశారు. 11వ తేదీ శనివారం ఉదయం అంగరంగ బ్రహ్మాండంగా శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ మహావిష్ణువు కల్యాణ వేడుకను చేపట్టనున్నామన్నారు. కల్యాణనంతరం చక్రస్నానం, మంగళహారతి జరుగుతుందని ఆలయ కమిటీ తెలియజేసింది. వేడుకలకు కంభరాయుని కొండకు మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారు. ఆ గ్రామ సర్పంచ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ముక్కోటి బసిరెడ్డి, నాయకులు, గ్రామస్తులు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం



పుల్లంపేట: మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



వీరబల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

వీరబల్లి : మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కావలిగడ్డకు చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డయ్య తండ్రి మృతి చెందడంతో అక్కడికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. దుగ్గనపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన వద్దకు వెళ్లి ఎమ్మెల్యే ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మండల కేంద్రంలో స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి నివాసంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. మండలంలోని వివిధ సమస్యలపై చర్చించారు. నాయకులు, కార్యకర్తల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ యువ నాయకులు మదన్ రెడ్డి, వీర నాగిరెడ్డి, సర్పంచ్‌లు గోపినాథ్ రెడ్డి, నరేష్ స్వామి, జిల్లా బీసీ నాయకులు మోడం నాగభూషణం, దిగువరాచపల్లి సర్పంచ్ కుమారుడు రవి, చిన్నగొల్లపల్లి సర్పంచ్ రామ జయచంద్ర, మండలంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పుల్లంపేట : పుల్లంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బీకే మణి తల్లి సుబ్బలక్షుమ్మ(93) సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాజంపేట శాసనసభ్యులు, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్‌రెడ్డి, రామనాథం, భరత్‌కుమార్‌రెడ్డి, మడగలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికులకు సమయానికి జీతాలు చెల్లించాలి



శానిటేషన్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీటీయూ జిల్లానేత విశ్వనాథ్

రాయచోటి అర్బన్ : ఏపీ ప్రోగ్రెసివ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (ఏఐసీసీటీయూ అనుబంధం) రాయచోటి పట్టణ కమిటీ అధ్యక్షుడుగా రామాంజనేయులు ఎంపికయ్యారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏఐసీసీటీయూ జిల్లానేత విశ్వనాథ్ ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్స్ సమావేశం జరిగింది. కమిటీ కార్యదర్శిగా రెడ్డిశేఖర్, ఉపాధ్యక్షుడిగా రాజు, కమిటీ సభ్యులుగా రమణ, గంగయ్య, సుశీలమ్మ, భారతి, నాగమ్మ, నాగలక్ష్మి, ఈశ్వరమ్మతోపాటు మరో 9 మందిని నూతన కమిటీగా ఎన్నుకున్నారు. ఏఐసీసీటీయూ జిల్లానేత విశ్వనాథ్ మాట్లాడుతూ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించాలన్నారు. చేతులకు గ్లౌజులతో పాటు ఇతర పనిముట్లను అందజేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీటీయూ నేత రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల పరిశీలన



ఓదివీటమ్మను దర్శించుకుంటున్న జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్

రాయచోటి టౌన్ : ఓదివీడు గ్రామంలో వెలసిన ఓదేటమ్మ ఆలయ మాన్య భూములు సుండుపల్లెలో ఉండటంతో జిల్లా దేవాదాయ అధికారి విశ్వనాథ్ ఆలయాన్ని సోమవారం సందర్శించారు. రాయచోటి, రాజంపేట డివిజన్ పరిధిలో అమ్మవారి మాన్యాలను పరిశీలించగా భూములు సుండుపల్లెలో సర్వేనెంబరులో 5.14 ఎకరాలు ఉన్నట్లు తెలిసిందని, ఈ భూమిని పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ పెద్దలతో కలిసి ఆలయ చరిత్రను, విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఆలయ మాన్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో వెలసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి వార్లను ఆయన దర్శించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ వీరబల్లి ఒక యూనిట్‌గా తీసుకొని 20 సెంట్ల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలన్నది విద్యార్థులకు చూపించడం జరిగింది. ఇందులో భాగంగా దుక్కి చేసి దుక్కిలో ఘన జీవామృతం వేసి తరువాత మొక్కజొన్న, క్యారెట్, మిరప, టమాటా వంటి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి విత్తనాలు నాటారు. అనంతరం ఈ విధానాన్ని ఎలా పాటించాలో, క్రిమి సంహారక మందుల వినియోగంపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.